క్లుప్తంగా

ద్వార బంధం ప్రతిష్ఠ వేడుకలు



ద్వార బంధాన్ని తీసుకెళ్తున్న మహిళలు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామంలో రూ.కోటిన్నర వ్యయంతో నిర్మిస్తున్న నూతన కానుక మాత దేవాలయానికి బుధవారం ద్వార బంధం ప్రతిష్ఠ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, డాక్టర్లు ప్రవీణ్, కూరపాటి ప్రదీప్, కార్పొరేటర్ కమర్తపు మురళి, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మందడపు మాధవరావు, నరసింహారావు, వాంకుడోత్ విజయ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

కామేపల్లి: మండలంలోని మద్రిగూడెం గ్రామంలో ఈనెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర, నాగేంద్ర, శీతలాపరమేశ్వరి, ముత్యాలమ్మతల్లి, అభయ అంజనేయస్వామి విగ్రహాలు, జీవధ్వజ ప్రతిష్ఠమహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

అర్హులకే సంక్షేమ పథకాలు అందాలి

కూసుమంచి: ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస పథకాలు అర్హులకే అందించాలని, వీటిలో అక్రమాలు జరిగితే ఉద్యమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్ హెచ్చరించారు. బుధవారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అధికార పార్టీకి చెందిన వారికే ఇస్తున్నట్లు గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారని, దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులకు న్యాయం జరుగకపోతే వారి పక్షాన పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లెల హన్మంతరావు, శీలం గురుమూర్తి, ఎడవెల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, కర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు ఘన స్వాగతం పలకాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని ఈనెల 31న ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అందుకొని వరంగల్‌కు వస్తున్న ఆయనకు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ ఖమ్మం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పోరాడిన ఏకైక వ్యక్తి మందకృష్ణ అన్నారు. అంజయ్య, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, అశోక్, బచ్చలకూర వెంకటేశ్వర్లు, వంగూరి ఆనందరావు, చిలక నాగరాజు, గాజుల నరసింహారావు, తూరుగంటి రాము, బాకీ శ్రీను, మంద గోపాలరావు, గొల్లమందల ముత్తారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: గుండెపోటుతో మృతి చెందిన వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ భౌతికకాయాన్ని బుధవారం పలు సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్–నంగారా బేరి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్ మాట్లాడుతూ.. త్వరలో జిల్లా వ్యాప్తంగా మదన్‌లాల్ సంస్మరణ సభలను నిర్వహిస్తామని ప్రకటించారు. నివాళులర్పించిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్, బహుజన జేఏసీ, వీరనారీమణుల ఆశయ సాధన సమితి బాధ్యులు రవీందర్ నాయక్, వీరన్ననాయక్, నాగేశ్వరరావునాయక్, సంజీవరావు, రవి, శ్రీనివాస్, నరేష్ భూక్య ఉపేంద్రబాయి, కె.లక్ష్మి, బి.జ్యోతి, త్రివేణి, విజయ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్, ఏసీ
వినోద	సింగిల్
సాయిరాం	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
ఆదిత్య	యమదొంగ, 23

– ఖమ్మంగాంధీచౌక్

పైసల్లేక.. పనులు సాగక..



ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయం

ఏదులాపురం మున్సిపాలిటీకి నిధుల లేమి

- నత్తనడక సాగుతున్న అభివృద్ధి పనులు
- కార్మికులకు రూ.65 లక్షల మేర పెండింగ్ వేతనాలు
- ఇంటి పన్నులే దిక్కయిన వైనం
- వేధిస్తున్న ఉద్యోగుల, సిబ్బంది కొరత

ఖమ్మంరూరల్: పేరుకే ఏదులాపురం మున్సిపాలిటీ. అభివృద్ధిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మున్సిపాలిటీ పరిస్థితి తయారైంది. రూరల్ మండలంలోని 12 గ్రామపంచాయతీలను, రెండు పంచాయతీల్లో కొంత భాగాన్ని కలిపి ఈ ఏడాది జనవరిలో కొత్తగా ఏదులాపురం మున్సిపాలిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే మున్సిపల్ పాలన మాత్రం ఫిబ్రవరి 6 నుంచి అధికారికంగా ప్రారంభమైంది. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులలేమితో ఏదో మున్సిపాలిటీ ఉంది అన్నట్లుగా సాగుతోంది. ఒక వైపు నిధుల కొరత.. మరో వైపు ఉద్యోగుల కొరత మున్సిపల్ అధికారులను తీవ్రంగా వేధిస్తోంది. అసలే మున్సిపాలిటీలో ఏ పని చేయాలన్నా నిధులు అవసరం ఉంటుంది. దానికి ఇప్పటి వరకు ఇంటి పన్నుల రూపేణా వచ్చే ఆదాయమే కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకే సరిపోని పరిస్థితి. మున్సిపాలిటీలో 12 పంచాయతీల్లో మొత్తం 32 వార్డులుగా విభజించారు. వాస్తవంగా వార్డు అధికారులుండాల్సి ఉండగా పాత గ్రామపంచాయతీ కార్యదర్శులనే కొనసాగిస్తున్నారు. అయితే వారు కూడా నిధులు లేక.. తమ వల్ల ఏ పని కావడంలేదని చేతులెత్తేశారు. ఆయా వార్డుల్లో ఏ వీధిలోనైనా వీధిలైటు పోతే వేసే పరిస్థితిలో మున్సిపాలిటీ కొట్టుమిట్టాడుతోంది.

అస్తవ్యస్తంగా పాలన..

మున్సిపాలిటీలో ఉండాల్సిన అకౌంటెంట్, టౌన్‌ప్లానింగ్ అధికారులను శాశ్వతంగా నియమించకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఇక మున్సిపల్ పరిధిలో సైడ్ డ్రెయిన్లలో చెత్తాచెదారం, మురుగునీరు పేరుకుపోయి నెలలు గడుస్తున్నా.. తొలగించే నాథుడే కరువయ్యారు. ఎందుకంటే పూర్తిస్థాయిలో పురపాలక పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో నలుగురు చేయాల్సిన పని ఒకరే చేయాల్సి వస్తోంది. దీంతో వార్డుల్లో ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. ఒక వేళ చెత్త సేకరించినా.. వేయడానికి డంపింగ్ యార్డు కూడా లేదు.

పాలక వర్గం ఏర్పడితేనే..

ఇదిలా ఉండగా గత రెండు నెలలుగా మున్సిపల్‌లో పని చేస్తున్న అన్ని రంగాల కార్మికులకు రూ.65 లక్షల మేర వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. గత నెలలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.90లక్షలు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి పనులు ప్రారంభించాల్సి ఉంది. మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగి పాలక వర్గం ఏర్పడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ల రూపంలో ఎంతో కొంత నిధులు మంజూరవుతాయి. కాని అది ఇప్పట్లో జరిగేలా కనిపించడంలేదు. ఇక అప్పటి వరకు నిధులతో పరిపాలన ఎలా సాగించాలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అవసరాల మేరకు..

మున్సిపాలిటీ అభివృద్ధి కోసం గత నెలలో అభివృద్ధి పనులకు రూ.90లక్షలు మంజూరయ్యాయి. అవసరాన్ని బట్టి ఒక క్రమపద్ధతిలో పనులు చేపడుతున్నాం. మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగి పాలకవర్గం ఏర్పడితే తప్ప అప్పటి వరకూ ఉన్న నిధులతోనే పనులు చేపడతాం.

– ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం డివిజన్ కమిటీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎల్లవేళలా సీనియర్ వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని, సొంత క్లినిక్‌లపైనే శ్రద్ధ వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఖాళీ పోస్టులు భర్తీ చేయడం, పర్మనెంట్ గుండె డాక్టర్ నియమించడమే కాక ఆస్పత్రి ప్రధాన గేట్ నుంచి మార్చురీ వరకు రోడ్డు వెడల్పు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నవీన్‌రెడ్డి, ఓ.నాగుల్‌మీరా, బోడపట్ల సుదర్శన్, జె.వెంకన్నబాబు, అంబటిపూడి సుధాకర్, భద్రం, గుమ్మడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రోత్సాహకం



విద్యార్థికి నగదు అందిస్తున్న సీఐ, యూనియన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెకానిక్ కుటుంబాల పిల్లలను ప్రోత్సహించేందుకు ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యాన ప్రోత్సాహకాలు అందజేశారు. ఈనేపథ్యాన బుధవారం నగరానికి చెందిన శెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు శెట్టి లోకేష్ 510 మార్కులు సాధించగా రూ. 5 వేల చెక్కును ఖమ్మం ట్రాఫిక్ సీఐ సాంబశివరావు అందించి సన్మానించారు. మెకానిక్ పిల్లలను ప్రోత్సహించేందుకు యూనియన్ ప్రోత్సాహం అభినందనీయమని సీఐ పేర్కొన్నారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతో ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఐను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు తటుకునూరి బ్రహ్మాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్, కోశాధికారి బల్లి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి దుంపల నాగరాజు, సభ్యులు ఆవుల ఉపేందర్, మధు, అన్నదేవర భద్రయ్య, దేవేందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

‘మతతత్వ రాజకీయాలు పెంచి పోషిస్తున్న కేంద్రం’



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంరూరల్: పాకిస్తాన్‌తో యుద్ధాన్ని కొనసాగిస్తున్న వేళ అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ చెబితే ప్రధాని మోదీ యుద్ధాన్ని ఆపేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మతతత్వ రాజకీయాలను పెంచి పోషిస్తూ ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతోందని, అధికార కాంక్షతో సాగిస్తున్న ఈ దమనకాండ దేశానికి ఎంతో ప్రమాదకరమన్నారు. అలాగే గిరిజన హక్కుల కోసం పోరాటం చేసే నక్సలైట్లపై నిరంకుశ వైఖరి కొనసాగిస్తున్నారని తెలిపారు. సోషలిజంతో సమ సమాజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టులు, బీజేపీ చేస్తున్న మత రాజకీయాలపై ప్రజలను చైతన్యపర్చాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ కంట్రోల్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఎండీ.మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సభ్యుడు మిడకంటి చినవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తుమ్మల యుగంధర్

ఖమ్మంగాంధీచౌక్: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి, స్వర మాధురి కల్చరల్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ‘పుణ్యభూమి నా దేశం నమో నమామి’పేరిట బుధవారం రాత్రి నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇంద్రనోమిక నాట్యాలయం చిన్నారుల నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. నిర్వాహకులు, సంస్థ అధ్యక్షుడు మల్లిఖార్జున్ మన్నేపల్లి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ పులిపాటి ప్రసాద్, ఆర్గనైజర్ ఇసనపల్లి నగేష్, గాయకులు వీవీ రెడ్డి, ఇంద్రనోమిక సంగీత నాట్యాలయం అధినేత ఎస్వీ రమణ, మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతి వేడుకలు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: ఎన్టీఆర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుల్లూరి బ్రహ్మయ్య

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం: వ్యవసాయకార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తిరుమలాయపాలెంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం అన్యాయమని, గ్రామీణ పేదల కోసం తీసుకొచ్చిన పథకాన్ని నీరు కార్చడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఇందుకు నిరసనగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున కూలీలు కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము నాగేశ్వరరావు, కె వెంకన్న, కొమ్ము శ్రీను, వెంకటేష్, పులకాని వెంకట నరసయ్య, కాంపాటి శ్రీదేవి, బొడ్డు లక్ష్మీ నారాయణ, సతీష్, ఉపేందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

తిరుమలాయపాలెం: భూ భారతి చట్టం–2025 అమలులో భాగంగా జూన్ 3 నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని తహసీల్దార్ విల్సన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రోజుకు ఒక రెవెన్యూ గ్రామంలో 20 రోజులు సదస్సులు నిర్వహించనున్నామన్నారు. భూమి సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉన్నా లేదా అర్హత ఉండి కూడా తమ పేర్లు నమోదు కాకపోయినా మరే ఇతర భూమి సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆడపిల్లలే ఇంటికి వెలుగు..

ఆడపిల్లలే ఇంటికి వెలుగని పలువురు అధికారులు పేర్కొన్నారు. మా ఇంటి మణి దీపం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలాల్లోని పలు గ్రామాల్లో ఆడబిడ్డ పుట్టిన వారి ఇళ్లకు వెళ్లి దంపతులను సన్మానించారు. పండ్లు, స్వీట్లతో పాటు ప్రశంసాపత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డను భారంగా భావించొద్దని, మగ పిల్లలతో సమానంగా పెంచి చదివించాలని కోరారు. – సాక్షినెట్‌వర్క్



కూసుమంచి: వెంకట్రాంపురంలో పాల్గొన్న అధికారులు



రఘునాథపాలెం: పంగిడిలో తల్లిదండ్రులను సన్మానిస్తున్న జిల్లా మైనార్టీ అధికారి పురంధర్



నేలకొండపల్లి: మోటాపురంలో తల్లిదండ్రులను సన్మానించి పండ్లు అందిస్తున్న అధికారులు



కామేపల్లి: జాస్తిపల్లిలో దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కాల్వ నిర్మాణ పనుల్లో జాప్యం వద్దు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్‌లో ఖమ్మం వైరా ప్రధాన రోడ్డు ఐటీ హబ్ నుంచి కోర్టు ప్రాంగణం వరకు కొనసాగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. బుధవారం పనులు సాగుతున్న ప్రాంతాల్లో పర్యటించిన ఆయన కాల్వ వెడల్పు, లోతు వంటి అంశాలను గుర్తించి, పనుల్లో జాప్యం లేకుండా వేగంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. కాలువలో నీటి ప్రవాహం దిగువకు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తరలించి నాణ్యతతో నిర్మించాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ చావా మాధురినారాయణరావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ పట్టాల పంపిణీ



పట్టాలు అందిస్తున్న చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం రైతు వేదికలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మంత్రి పొంగులేటి చొరవతో మండలానికి అదనంగా ఇళ్ల మంజూరయ్యాయని పేర్కొన్నారు. అలాగే రైతులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు మాజీ సర్పంచ్‌లు పెంటమళ్ల పుల్లమ్మ, కొమ్మినేని విజయ్‌బాబు, వడ్లమూడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి హద్దులు..

ఖమ్మంరూరల్: ఏదులాపురంలోని సర్వే నంబర్ 87లో ఉన్న 5.27 ఎకరాల సీలింగ్ భూమికి బుధవారం తహసీల్దార్ పి.రాంప్రసాద్, రెవెన్యూ సిబ్బంది హద్దులు ఖరారు చేశారు. గతంలో ఈ భూమిని ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేయగా.. ఇప్పుడు హద్దులు నిర్ణయించి భూమి చుట్టూ ఎనిమిది హద్దు రాళ్లు పాతినట్లు తహసీల్దార్ తెలిపారు. అయితే గతంలో ఈభూమి పక్కనే వెంచర్లు వేసిన వారు కొంతమేర ప్రభుత్వ భూమిలో రాళ్లను వేయించారు. అట్టి రాళ్లను తొలగించి పూర్తిగా భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. త్వరలో వివిధ ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించనున్నామన్నారు.

మేరీమాత శోభా యాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న ఫాదర్లు

కూసుమంచి: పాలేరులోని అద్భుతాల మేరీమాత పుణ్యక్షేత్రంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం మేరీమాత శోభాయాత్రను వేడుకగా నిర్వహించారు. పాలేరు పుణ్యక్షేత్ర విచారణ గురువు ఫాదర్ కొమ్ము అంటోనీ పర్యవేక్షణలో ఈ యాత్రను గ్రామంలో శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ఫాదర్లు లూకాస్, జయరాజు, ఆంటోనీ దైవ సందేశాలను అందించారు. కరుణామయుడైన ఏసు ప్రభువుకు జన్మనిచ్చిన మేరీమాత పునీతురాలై సర్వ మానవాళికి దీవెనలు అందించారని పేర్కొన్నారు. పాలేరు పుణ్యక్షేత్రంలోని మేరీమాత స్వరూపం ఆసియా ఖండంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము ప్రసాద్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఖమ్మంరూరల్/కూసుమంచి/తిరుమలాయపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించబడుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్.రంజాన్ తెలిపారు. బుధవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన ఖమ్మంరూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో చేపట్టిన జిల్లా కమిటీ ప్రచార జాతాలో ఆయన మాట్లాడారు. పిల్లలమానసిక ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ప్రభుత్వ బడులు రూపుదిద్దుకుంటున్నాయని, అనేక వసతులతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను బోధిస్తూ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. కాగా, గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నేటి నుంచి పది రోజులు పాటు ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమాన కూసుమంచి తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డిలను కలిసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు బత్తుల గణపతి, కేశ్య, రామయ్య, మండవ నర్సయ్య, ఉద్దండు షరీఫ్, సతీష్, రాంబాబు, రంగమ్మ, సిరంజిత తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో మాట్లాడుతున్న రంజాన్

ఒక్కొక్కటిగా తొలగిస్తూ..

నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు విస్తరణ పనులను కేఎంసీ అధికారులు ప్రారంభించారు. మార్కింగ్ చేసిన వరకు రోడ్డు వెంట దుకాణాలను తొలగించే పనులు చేపట్టడంతో దుకాణదారులు తమ వస్తువులను జాగ్రత్తగా తరలించుకుంటున్నారు. నేమ్ బోర్డులు పాడవ్వకుండా ఎవరికివారే ఒక్కొక్కటిగా తొలగిస్తూ సర్దుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



మార్కింగ్ చేసిన దుకాణ మెట్లను తొలగిస్తూ ఇలా..





రైల్వే స్టేషన్ రోడ్డులో నేమ్ బోర్డులు తొలగిస్తున్న దుకాణదారులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్.ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 8184
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957